చెలరేగిన షఫాలీ

- యూపీపై ఢిల్లీ ఘనవిజయం
- డబ్ల్యూపీఎల్ రెండో సీజన్

బెంగళూరు: బౌలర్ల శ్రమకు ఓపెనర్ల దంచుడు తోడవడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తొలి విజయం నమోదు చేసుకుంది. లీగ్ ఆరంభ పోరులో ముంబై చేతిలో ఓడిన ఢిల్లీ.. సోమవారం 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన యూపీ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 119 పరుగులు చేసింది. శ్వేత షెరావత్ (45) టాప్ స్కోరర్ కాగా.. ఢిల్లీ బౌలర్లలో మరినె కాప్ 4 ఓవర్లలో 5 పరుగులే ఇచ్చి 3 వికెట్లు పడగొట్టింది. రాధ యాదవ్‌కు 4 వికెట్లు దక్కాయి. అనంతరం లక్ష్యఛేదనలో ఢిల్లీ 14.3 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 123 పరుగులు చేసింది. ఓపెనర్లు మెగ్ లానింగ్ (51; 6 ఫోర్లు), షఫాలీ వర్మ (43 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) అర్ధశతకాలతో అదరగొట్టారు. లీగ్‌లో భాగంగా మంగళవారం గుజరాత్ జెయింట్స్‌తో బెంగళూరు తలపడనుంది.

సెమీస్‌లో పట్నా పైరేట్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రొ కబడ్డీ లీగ్‌లో పట్నా పైరేట్స్ ఎనిమిదోసారి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రొ కబడ్డీ లీగ్ ఎలిమినేటర్-1 మ్యాచ్‌లో పట్నా 37-35 తేడాతో దబంగ్ ఢిల్లీపై విజయం సాధించింది. బుధవారం జరగనున్న తొలి సెమీఫైనల్లో పుణెరీ పల్టన్స్‌తో పట్నా తలపడనుంది. తొలి అర్ధభాగం ముగిసేసరికి ఢిల్లీ 20-19తో స్వల్ప ఆధిక్యంలో ఉండగా.. సెకండ్ హాఫ్‌లో విజృంభించిన పట్నా ముందంజ వేసింది. పట్నా తరపున అత్యధికంగా సచిన్ 9 పాయింట్లు సాధించాడు. ఢిల్లీ తరపున ఆషు మాలిక్ 19 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. మరో ఎలిమినేటర్‌లో హర్యానా స్టీలర్స్ 42-25తో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. రెండో సెమీస్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో హర్యానా అమీతుమీ తేల్చుకోనుంది.

బ్లాక్‌హాక్స్ పరాజయం

ప్రైమ్ వాలీబాల్ లీగ్

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ మూడో సీజన్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ మూడో పరాజయం మూటగట్టుకుంది. చెన్నై వేదికగా సోమవారం హోరాహోరీగా సాగిన పోరులో హైదరాబాద్ 11-15, 15-13, 9-15, 11-15తో ఢిల్లీ తూఫాన్స్ చేతిలో ఓడింది. తాజా సీజన్‌లో ఢిల్లీకి ఇది రెండో విజయం కాగా.. సంతోష్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తొలి సెట్ కోల్పోయిన హైదరాబాద్.. రెండో సెట్‌లో సత్తాచాటి స్కోర్లు సమం చేసినా.. ఆ తర్వాత ఢిల్లీ స్పైకర్లు వరుస స్మాష్‌లతో పాయింట్లు కొల్లగొట్టి మ్యాచ్‌ను వశం చేసుకున్నారు.

సిరీస్ నం. 17

నాలుగో టెస్టులో భారత్ జయభేరి

5 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు

మెరిసిన గిల్, జురెల్

సొంతగడ్డపై టీమ్‌ఇండియా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌ను చిత్తుచేసిన రోహిత్‌సేన వరుసగా 17వ టెస్టు సిరీస్ ఖాతాలో వేసుకుంది. 'బజ్‌బాల్'తో దంచికొడతామని బీరాలు పలికిన ఇంగ్లిష్ ప్లేయర్లను నేలకు దింపుతూ.. మరో మ్యాచ్ మిగిలుండగానే భారత్ సిరీస్ పట్టేసింది! స్వల్ప లక్ష్యఛేదనలో కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ అర్ధశతకాలతో అదరగొట్టగా.. ధ్రువ్ జురెల్, యశస్వి ఆకట్టుకున్నారు. ఒకదశలో 120 పరుగులకు 5 వికెట్లు కోల్పోవడంతో.. ఒక దశలో ఇంగ్లండ్‌కు ఆశలు చిగురించినా.. గిల్, జురెల్ చివరి వరకు నిలిచి మ్యాచ్‌ను ముగించారు.

రాంచీ: 'బజ్‌బాల్' ఎరాలో తొలిసారి ఇంగ్లండ్ జట్టుకు షాక్ తగిలింది. భారత్‌లో దూకుడు మంత్రం పనిచేయదని ఇంగ్లిష్ జట్టుకు బాగా తెలిసొచ్చింది. సొంతగడ్డపై తన ఆధిపత్యాన్ని కొనసాగించిన టీమ్‌ఇండియా.. వరుసగా 17వ టెస్టు సిరీస్‌తో సత్తాచాటింది. నాలుగు రోజుల్లో ముగిసిన రాంచీ టెస్టులో భారత్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసి మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సిరీస్ ఖాతాలో వేసుకుంది. 2012-13లో స్వదేశంలో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయిన తర్వాత ఈ పుష్కర కాలంలో టీమ్‌ఇండియా మరో సిరీస్ ఓడలేదు. 192 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 40/0తో సోమవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన రోహిత్ సేన 5 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. కెప్టెన్ రోహిత్ శర్మ (55; 5 ఫోర్లు, ఒక సిక్సర్), శుభ్‌మన్ గిల్ (52 నాటౌట్; 2 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించగా.. యశస్వి జైస్వాల్ (37), ధ్రువ్ జురెల్ (39) సత్తాచాటారు. ఇంగ్లండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 3 వికెట్లు పడగొట్టాడు. ఒక దశలో టీమ్‌ఇండియా 120 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డట్టు కనిపించినా.. గిల్, జురెల్ జోడీ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా చెలరేగింది. బంతి అనూహ్యంగా తిరుగుతున్న పిచ్‌పై ఈ ఇద్దరూ గొప్ప సంయమనం పాటిస్తూ ముందుకు సాగారు. ఇరు జట్ల మధ్య వచ్చే నెల 7 నుంచి ధర్మశాల వేదికగా నామమాత్రమైన ఐదో టెస్టు జరగనుంది.

ఇంగ్లండ్ ప్లేయర్లకు బ్రేక్

సుదీర్ఘ పర్యటనలో ఉన్న ఇంగ్లండ్ నాలుగో టెస్టు తర్వాత విరామం తీసుకోనుంది. తదుపరి మ్యాచ్‌కు గడువు ఎక్కువ ఉండటంతో.. ఇంగ్లిష్ ప్లేయర్లు రెస్ట్ తీసుకోనున్నారు. ఆట గాళ్లు బెంగళూరు, చండీగఢ్‌లో ఉంటారని ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు వెల్లడించింది.

1 స్వదేశంలో వరుసగా అత్యధిక (17) సిరీస్ విజయాలు సాధించిన జట్టుగా భారత్ తన స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఆస్ట్రేలియా రెండు సార్లు వరుసగా పదేసి సిరీస్‌లు నెగ్గింది.

సంక్షిప్త స్కోర్లు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353;భారత్ తొలి ఇన్నింగ్స్: 307; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 145; భారత్ రెండో ఇన్నింగ్స్: 192/5 (రోహిత్ 55, గిల్ 52 నాటౌట్; బషీర్ 3/79).

డబ్ల్యూటీసీ @ 2

దుబాయ్: నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌పై ఘనవిజయం సాధించిన టీమ్‌ఇండియా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు 59.52 పాయింట్లతో ఉన్న రోహిత్ సేన విజయంతో 64.58 పాయింట్లకు చేరింది. న్యూజిలాండ్ (75.00 పాయింట్లు) అగ్రస్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా (55.00 పాయింట్లు) మూడో ప్లేస్‌లో ఉంది.

పారా సైక్లింగ్‌లో భారత్‌కు 4 స్వర్ణాలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఏషియన్ పారా ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత సైక్లిస్ట్‌లు సత్తాచాటారు. సోమవారం ఒక్క రోజే మనవాళ్లు 4 స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యం సొంతం చేసుకున్నారు. అర్షద్ షేక్ (సీ2 కేటగిరీ)లో రెండు స్వర్ణాలు కైవసం చేసుకోగా.. జ్యోతి గదేరియా (సీ2 కేటగిరీ)లో రెండు పసిడి పతకాలు గెలుచుకున్నారు. దీంతో ఈ టోర్నీలో భారత్ పతకాల సంఖ్య 16కు చేరింది. ఇందులో 8 స్వర్ణాలు, 6 రజతాలు, 2 కాంస్యాలు ఉన్నాయి.

రాష్ట్రానికి చెందిన యువ గోల్ఫర్లకు ఆసియా టాప్ ప్లేయర్ అమన్ రాజ్ సోమవారం హైదరాబాద్‌లోని గోల్ఫ్ క్లబ్‌లో విలువైన సూచనలిచ్చాడు.

ఇక ఆంధ్రకు ఆడను

బెంగళూరు: భవిష్యత్తులో ఆంధ్ర క్రికెట్ జట్టుకు ఆడబోనని.. టీమ్‌ఇండియా ప్లేయర్ హనుమ విహారి అన్నాడు. క్రికెట్‌లో రాజకీయ నేతల జోక్యంతో మనస్తాపం చెంది ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు విహారి సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించాడు. దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్ చేతిలో ఆంధ్ర పరాజయం పాలైన అనంతరం విహారి తన నిర్ణయాన్ని వెల్లడించాడు. 'ఆటలో రాజకీయాలు తగవు. ఓ నేత కుమారుడి కోసం నన్ను కెప్టెన్సీ నుంచి తప్పించారు. రంజీ మ్యాచ్ సందర్భంగా ఓ ఆటగాడిపై నేను కోప్పడ్డాను. అతడు తన తండ్రి రాజకీయ అండతో నాపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఏసీఏపై ఒత్తిడి చేశాడు. దీంతో సారథ్య బాధ్యతల నుంచి నన్ను తప్పించారు' అంటూ విహారి సుదీర్ఘ పోస్ట్ పెట్టాడు. మరోవైపు విహారి ప్రవర్తనపై జట్టు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ జరపనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఆకర్షికి టైటిల్

న్యూఢిల్లీ: భారత యువ షట్లర్ ఆకర్షి కశ్యప్.. ఉగాండా ఇంటర్నేషనల్ చాలెంజ్ ట్రోఫీ కైవసం చేసుకుంది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ఆకర్షి 25-23, 21-18తో భారత్‌కే చెందిన శృతిపై విజయం సాధించింది. 48 నిమిషాల పాటు సాగిన పోరు తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనా.. కీలక పాయింట్లు సాధించి ముందంజ వేసిన ఆకర్షి.. రెండో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగిస్తూ టైటిల్ ఖాతాలో వేసుకుంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.